సాక్షి రంగారెడ్డి

సోమవారం । 12 । ఆగస్టు । 2024



సాగుకు ఆదరువు

పంటల సాగులో ఎరువుల పాత్ర అత్యంత కీలకం. జీవన ఎరువుల వాడకం రైతులకు పెట్టుబడిభారాన్ని తగ్గిస్తోంది. 8లో▸



మరొకరికి ప్రాణదానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతిఒక్కరూ గుర్తించాలని సామాజికవేత్త రామకృష్ణారావు పేర్కొన్నారు. 8లో▸



స్మరించుకోవాలి

మహనీయుల సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ పేర్కొన్నారు. 8లో▸

నేడు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : శంకర్‌పల్లి
కమిషనర్ : శ్రీనివాస్
తేదీ : 12-08-2024 (సోమవారం)
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73311 27776

న్యూస్‌రీల్

ఆవోపా రాష్ట్ర కార్యదర్శిగా ఆనంద్‌బాబు



ఆనంద్‌బాబును సన్మానిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ తదితరులు

షాద్‌నగర్: ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పలబట్ల ఆనంద్‌బాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆనంద్‌బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఆర్థిక కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్టా రవికుమార్ ఆనంద్‌బాబును సన్మానించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



పార్టీ నాయకులు, కార్యకర్తలతో సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగాలని, పార్టీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, బాలరాజు, సత్యం, మల్లేశ్, యాదయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సీఎం చొరవ చూపాలి




సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: నగరాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపించి నిధుల కేటాయింపులు పెంచాల్సిన అవసరముందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్‌లో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ అత్యంత ప్రాముఖ్యతగల నగరమన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇది ఒకటని అభిప్రాయపడ్డారు. నగరంలో మౌలిక వసతుల కల్పనకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. నగరం నుంచి అధిక ఆదాయం వస్తున్నా కేటాయింపుల్లో పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. హైటెక్ సిటీ ప్రాంత అభివృద్ధికి చూపిస్తున్న శ్రద్ధ పాత నగరంపై కనబర్చడంలేదన్నారు.

‘మొక్క’బడిగా..

ప్రహసనంగా మొక్కలు నాటే కార్యక్రమం

- ఏటా లక్షల్లో నాటుతున్నట్లు లెక్కలు
- మొక్కలు, గుంతలు, ట్రీగార్డులకు భారీగా ఖర్చు
- ఆ తర్వాత నిర్వహణ, సంరక్షణ చర్యలు కరువు
- నాటిన కొద్ది రోజులకే కనుమరుగు




సాక్షి, రంగారెడ్డిజిల్లా: మొక్కలు నాటే కార్యక్రమం జిల్లాలో ప్రహసనంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టగా, ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో నిర్వహిస్తోంది. సదుద్దేశంతో చేపట్టిన కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతోంది. మొక్కలు నాటడం, సెల్ఫీలు దిగడం వరకే పరిమితం అవుతున్నారు. ఆ తర్వాత వాటి సంరక్షణ చర్యలను పట్టించుకోవడం లేదు. కనీసం నీరు కూడా పోయడం లేదు. దీంతో వర్షానికి నాటుకుని, పచ్చగా చిగురించిన మొక్కలు సైతం ఆ తర్వాత వేసవి తాపానికి తట్టుకోలేక వాడిపోతున్నాయి. ప్రణాళికబద్ధంగా నాటకపోవడం.. ఎత్తయిన చెట్ల కిందే తిరిగి నాటడం.. వేసవిలో నీరు పోయకపోవడం.. రక్షణ కోసం ట్రీగార్డులు ఏర్పాటు చేయకపోవడం తదితర కారణాలతో మెజార్టీ మొక్కలు నాటిన కొద్ది రోజులకే చనిపోతున్నాయి. ప్రస్తుతం పల్లె ప్రకృతి వనాల్లో మినహా ఎక్కడా ఆశించిన స్థాయిలో మొక్కలు కనిపించడం లేదు.

ఏటా పెద్ద ఎత్తున ప్లాంటేషన్

జిల్లాలో 29,545.90 హెక్టార్ల అటవీ (5.93శాతం) భూమి ఉంది. జిల్లాలో 83 ఫారెస్ట్ బ్లాకులు ఉండగా, వీటిలో 69 హెచ్‌ఎండీఏ నిర్వహణలో ఉన్నాయి. పట్టణీకరణతో కాలుష్యం పెరుగుతోంది. దీన్ని నియంత్రించి, ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని గత ప్రభుత్వం భావించింది. పచ్చదనాన్ని 24 నుంచి 33 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించింది. గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాలనీల్లోని రోడ్లకు ఇరువైపులా ఉన్న ఖాళీ ప్రదేశాలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాలు, అడవులు, రోడ్లకు ఇరువైపులా ఉండే ఖాళీ స్థలాల్లో ఏటా భారీగా మొక్కలు నాటుతున్న విషయం తెలిసిందే. 2015–16లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో జిల్లాలో 73.78 లక్షల మొక్కలు నాటింది. ఇలా ఏటా సుమారు కోటి మొక్కలు నాటుతున్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం పేరును తొలగించి ‘వనమహోత్సవం’ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది.

ఒక్కో మొక్కపై అధికంగా ఖర్చు

రోడ్డు వెంట నాటే మొక్కల కోసం తవ్వే గుంత (రెండు అడుగుల వెడల్పు, రెండు అడుగుల పొడవు, రెండు అడుగుల లోతు)కు రూ.72 చొప్పున చెల్లిస్తోంది. ఒక్కో మొక్కకు రూ.36 చొప్పున, నాటిన మొక్కకు సపోర్టింగ్ కర్ర (ఐదు నుంచి ఆరు ఫీట్లు)కు రూ.24 చొప్పున చెల్లిస్తోంది. కమ్యూనిటీ భూములు (పార్కులు, ఆఫీసు ఆవరణలు, పారిశ్రామిక ఆవరణలు) నాటే మొక్కకు అడుగున్నర గుంతకు రూ.32 చొప్పున, మొక్కను నాటినందుకు రూ.5 చొప్పున ఇస్తున్నారు. నాటిన మొక్కకు సపోర్టింగ్ కర్రను ఏర్పాటు చేసినందుకు రూ.12 చొప్పున చెల్లిస్తున్నారు. నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రతి 400 మొక్కలకు వాచర్‌ను నియమించి రోజుకు రూ.300 చొప్పున ఇస్తున్నారు. ఇలా మూడేళ్ల వరకు చెల్లిస్తుండగా ఈ పనులన్నీ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతోంది. ఇలా ఒక్కో మొక్కకు సగటున ప్రభుత్వం రూ.150 వరకు ఖర్చు చేస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో నాటిన మొక్కలు ఆ తర్వాత మాయమైపోతున్నాయి.



నాగార్జున సాగర్ రోడ్డులో తుర్కయంజాల్ వద్ద చెట్ల కిందే నాటిన మొక్కలు..

జిల్లాలో ఏటా నాటిన మొక్కలు ఇలా..

సంవత్సరం	నాటిన మొక్కలు (లక్షల్లో..)
2015-16	73.78
2016-17	139.24
2017-18	71.04
2018-19	86.12
2019-20	105.42
2020-21	102.74
2021-22	89.24
2022-23	81.41
2023-24	85.06
2024-25	80.02



కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

- నాగన్‌పల్లి, అనాజ్‌పూర్‌లో సీపీఎం బృందం పర్యటన
- రియల్టర్లు ఆక్రమించిన ప్రభుత్వ భూముల పరిశీలన
- ఎర్రజెండాలు నాటి, పేదలకు పంచుతామని స్పష్టీకరణ

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రియల్టర్లు ఆక్రమించిన ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్, లావుణి భూముల్లో ఎర్రజెండాలు పాతుతామని, వాటిని మళ్లీ పేదలకు పంచుతాం అని సీపీఎం నేతలు స్పష్టం చేశారు. ‘కన్నేసి.. కలిపేసి’ శీర్షికన ఆదివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన వారు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ నేతృత్వంలో కార్యదర్శివర్గ సభ్యులు సామేలు, జగదీష్, మండల కార్యదర్శి జంగయ్య, జగన్, బుగ్గిరాములు, వెంకటేశ్, ఆనంద్, నర్సింహ, అశోక్‌తో కూడిన బృందం ఆదివారం ఇబ్రహీంపట్నం నాగన్‌పల్లి సర్వే నంబర్ 189లోని 179.33 ఎకరాలు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లోని సర్వే నంబర్ 281లోని 300 ఎకరాల ఆక్రమిత ప్రభుత్వ భూములను పరిశీలించారు. రైతులకు ఇచ్చిన భూములను రియల్టర్లు కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో నుంచి వెంచర్‌కు రోడ్డు వేస్తుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే ఈ భూములను పీఓటీ కింద వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయా భూముల్లో ఎర్రజెండాలు పాతి, తిరిగి వాటిని పేదలకు పంచుతామని హెచ్చరించారు. సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి అండతోనే ఈ భూముల అన్యాక్రాంతం జరుగుతోందని ఆరోపించారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లు రియల్టర్లతో కుమ్మక్కయ్యారని ధ్వజమెత్తారు. పేదలు 60 గజాల స్థలంలో ఇళ్లు కట్టుకుంటే అడ్డుకునే అధికారులు.. కళ్ల ముందు ఇంత పెద్ద ఎత్తున భూస్కాం జరుగుతున్నా ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిల్లాలో 17 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన కుటుంబ సభ్యులే భూ కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రెవెన్యూ యంత్రాంగం వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రత్యక్ష భూ పోరాటాలకు శ్రీకారం చుట్టడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

మీరు ఒలింపిక్స్‌కు వెళ్తే గోల్డ్ మెడలే

సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ‘ఎక్స్’లో నెటిజన్ వ్యాఖ్య

సాక్షి, సిటీబ్యూరో: పారిస్ ఒలింపిక్స్ సీజన్‌లో ‘ఎక్స్’ వేదికగా ఆదివారం ఆసక్తికర అంశం చోటుచేసుకుంది. కొందరు నెటిజనులు మాజీ కొత్వాల్, ప్రస్తుత ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్‌లోని క్రీడాకారుణ్ని పలకరించారు. వారి ప్రశ్నలకు ఓపికగా జవాబు ఇచ్చిన ఆనంద్.. తాను చదువుకున్న, ఐపీఎస్ శిక్షణలో ఉన్న రోజుల్లో సాధించిన పతకాలకు సంబంధించిన జ్ఞాపకాలు పంచుకున్నారు. ‘ఎక్స్’లో ఆనంద్‌కు, నెటిజనులకు మధ్య సంభాషణ ఇలా సాగింది..

హైదరాబాద్ వైబ్: సర్.. మీరు చదువుకునే రోజుల్లో మంచి అథ్లెట్ అని మీ స్కూల్‌మేట్ ఒకరు చెప్పారు.

సీవీ ఆనంద్: హాయ్.. ఆ స్కూల్ మేట్ ఎవరు? ఆ రోజుల్లో నేను 100 మీటర్లు, 200 మీటర్లు, హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌ల్లో పతకాలు సాధించా. కాలేజీ రోజులతో పాటు జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న రోజుల్లోనూ బెస్ట్ అథ్లెట్‌నే. అప్పట్లో 100 మీటర్ల పరుగును కేవలం 11.2 సెకన్లలో పూర్తి చేశా. ఇవిగో నేను సాధించిన మెడల్స్ అంటూ.. రెండు ఫొటోలు పోస్టు చేశారు.

రియాజ్: అబ్బా.. ఎన్ని మెడల్సో.. మీరు ఒలింపిక్స్‌లో పాల్గొని ఉంటే కచ్చితంగా బంగారు పతకం వచ్చేది.

సీవీ ఆనంద్: ఔను రియాజ్... నిజమే. బతుకుదెరువు కోసం చదువు, పరీక్షలు తప్పలేదు. ఇప్పుడు ఇదిగో ఇలా ఉన్నా.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- ఆస్పత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- సర్దిచెప్పి పంపించిన పోలీసులు



మృతదేహం పట్టుకొని రోదిస్తున్న కుటుంబీకులు

ఇబ్రహీంపట్నం: చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించిన చిన్నారి మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. వివరాలివీ.. మండలంలోని రాయపోల్ గ్రామానికి చెందిన ప్రవళిక, మహేశ్ దంపతుల కుమారుడు ప్రజ్వల్ (8 నెలలు)కు జ్వరం రావడంతో శనివారం ఇబ్రహీంపట్నంలోని రవికృష్ణ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. డెంగీగా వైద్యులు నిర్ధారించారు. రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని ఆదివారం ఉదయం తల్లిదండ్రులకు తెలిపారు. వెంటనే నగరానికి తరలిస్తుండగా ప్రజ్వల్ మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహానికి గురై ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. శనివారం ఆస్పత్రిలో చేర్పిస్తే సరైన పరీక్షలు చేయలేదని, వైద్యులు అందుబాటులో లేక కాలయాపన చేసినందుకే బాలుడు మృతి చెందాడని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమేనని కారణమని, ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారికి సీఐ సత్యనారాయణ సర్దిచెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రజ్వల్ మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.



మహనీయుల మార్గం..

స్వాతంత్య్ర దినోత్సవాలకు నగరం సిద్ధమవుతోంది. మహనీయుల త్యాగాలను స్మరించుకునే తరుణం ఆసన్నమైంది. వారి మార్గమే మనకు శిరోధార్యమైంది. ఈ క్రమంలో ఆ మహనీయుల రూపాలు మదిలో మెదిలేలా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చిత్రాలు ప్రాణం పోసుకుంటున్నాయి. ఖైరతాబాద్ దారిలోని ఫ్లై ఓవర్‌పై ఇరువైపులా ఉన్న గోడలపై కళాకారులు మహనీయుల చిత్రాలను రూపొందిస్తున్నారు.

ఉచిత ‘బియ్యం’ పక్కదారి

ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న ‘ఉచిత బియ్యం’ బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి. తాము డ్రా చేస్తున్న బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు కిలో రూ.8 చొప్పున విక్రయిస్తుండటంతో అధికారులను విస్మయానికి గురి చేస్తోంది. శనివారం పాతబస్తీలోని చాంద్రాయణగుట్టలో 14 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం సేకరించి రెండు వాహనాల్లో రవాణా చేసేందుకు సిద్ధమైన ముగ్గురు వ్యక్తులు చిక్కారు.

- ప్రతి నెలా 80- 90 శాతం కోటా డ్రా
- వండి తినడానికి లబ్ధిదారుల అనాసక్తి
- కిలో రూ.8 చొప్పున విక్రయం
- ఇడ్లీ, దోశ, పిండి వంటలకు వినియోగం
- బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న రేషన్ బియ్యం



సాక్షి, సిటీబ్యూరో: పీడీఎస్ బియ్యం వండి తినడానికి లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. బియ్యం దొడ్డుగా, నాసిరకం, ముక్కి పోయి ఉండడం, వండి తిన్న తర్వాత జీర్ణం కాకపోవడం అంశాలు ప్రధాన కారణంగా మారాయి. కుటుంబం గడవని పేదలు మినహా మిగతా వారు రేషన్ బియ్యాన్ని ఇడ్లీ, దోశ, పిండి వంటలకు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా ఉచితంగా అందుతుండటంతో అవసరానికి మించి నిల్వలు ఉంటున్నాయి. వాటిని ఇంటి వద్దకు వచ్చే చిరు వ్యాపారులకు, ఇడ్లీ, దోశ, మిర్చీ కేంద్రాలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా సుమారు 80 నుంచి 90 శాతం కోటా డ్రా అవుతోంది.

నగదు రూపంలో..

కొందరు లబ్ధిదారులు రేషన్ షాపు వద్దనే ఉచిత బియ్యాన్ని నగదు రూపంలో మార్చుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. నెలవారీ కోటా డ్రాలో ఒక యూనిట్ కోటా బియ్యం మినహా మిగతా యూనిట్ల కోటాను డీలర్లకు అప్పగించి నగదు రూపంలో బదిలీ చేసుకుంటున్నారు. వాస్తవంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఈ- పాస్ (బయోమెట్రిక్) అమలు కంటే ముందు రేషన్ డీలర్లు చేతివాటం ప్రదర్శించి డ్రా చేయని లబ్ధిదారుల సబ్సిడీ సరుకులు గుట్టుచప్పుడు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకునే వారు. సంస్కరణలో భాగంగా ఈ- పాస్ అమలుతో లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిస్, ఓటీపీ తప్పనిసరి కావడంతో డీలర్లు లబ్ధిదారుల ప్రమేయంతో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. లబ్ధిదారులచే ఈ-పాస్‌పై బయోమెట్రిక్ తీసుకొని అక్రమ తంతు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ-పాస్ ద్వారా బియ్యం కోటా డ్రా కాగానే లబ్ధిదారుల అంగీకారంతో బియ్యం బదులు నగదు ముట్టజెప్పడం తంతుగా మారింది.

నిద్ర మత్తులో నిఘా..

పీడీఎస్ బియ్యం అక్రమ దందాను అడ్డు కట్టవేయాల్సిన పౌరసరఫరాల శాఖ నిద్రమత్తులో జోగుతోంది. అడపాదడపా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుల దాడుల్లో పీడీఎస్ బియ్యం క్వింటాళ్ల కొద్దీ పట్టుబడుతోంది. ఇటీవల ఎల్బీనగర్, అత్తాపూర్, రాజేంద్రనగర్, మహేశ్వరం, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో వందలాది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. స్పెషల్ డ్రైవ్ సమయంలో బియ్యం వ్యాపారులు ఎక్కడి దొంగలు అక్కడే గప్.. చుప్ అన్నచందంగా మౌన పాత్ర పోషిస్తున్నారు. ఆ తర్వాత తిరిగి దందాను కొనసాగించడం షరా మామూలుగా మారింది.

రైస్ మిల్లు సీజ్ - పీడీ యాక్ట్ కింద కేసు

రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన ఓ రైస్ మిల్లుపై పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొరడా ఝుళిపించింది. కొనుగోలుదారులపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడంతో పాటు రైస్ మిల్లును అధికారులు సీజ్ చేశారు. పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ బృందం నగర శివారు పెద్ద గోల్కొండలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లుపై దాడులు నిర్వహించింది. సుమారు 40 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంది. కొందరు ముఠా ఏర్పడి పెద్ద గోల్కొండ, శంషాబాద్, కందుకూరు, కడ్తాల్, మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి మిల్లులో డంప్ చేస్తున్నట్లు గుర్తించినట్లు రఘునందన్ వివరించారు. మిల్లు నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

మహనీయులను స్మరించుకోవాలి



మహనీయుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్

మొయినాబాద్ రూరల్: మన ప్రాంతాల్లో ఉన్న మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసుకుని వారి సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలంలోని మెదక్‌నగర్ చౌరస్తాలో బాబూ జగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను బీజేపీ యువ మోర్చా నాయకులతో కలిసి ఆయన నీటితో శుభ్రం చేయించారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయులను స్మరించుకున్నప్పుడే దేశభక్తి పెంపొందుతుందన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జ్ఞానేశ్వర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దూషిస్తూ.. కత్తులతో దాడి

యువకుడికి తీవ్ర గాయాలు



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ నాగరాజుగౌడ్

మాడ్గుల: కులం పేరుతో దూషిస్తూ ఓ యువకుడిపై కత్తులతో దాడి చేసిన సంఘటన మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆర్కపల్లి గ్రామానికి చెందిన పందుల లింగమయ్య(28)ను అదే గ్రామానికి చెందిన యాచారపు బిక్కయ్య శనివారం రాత్రి పని నిమిత్తం బయటకు తీసుకెళ్లారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం సమీప గ్రామమైన సుద్దపల్లి శివారులో అప్పటికే కాపు కాసిన జగత్తయ్య, బాలరాజు, శ్రీశైలం, బాలయ్యలు కత్తులతో లింగమయ్యపై దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన్ని బురదలో పడేశారు. విషయం తెలుసుకున్న బాధితుడి తండ్రి ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే నిందితులు పారిపోయారు. వెంటనే లింగమయ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తన కొడుకుని కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని తండ్రి రాములు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారును ఢీ కొట్టిన టిప్పర్

నలుగురికి గాయాలు

మణికొండ: వేగంగా దూసుకు వచ్చిన ఓ టిప్పర్ లారీ అకస్మాత్తుగా మలుపు తీసుకున్న ఓ కారును ఢీ కొట్టి దానిపై పడిపోయిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైహోం అవతార్ సర్కిల్‌లో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నార్సింగి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నార్సింగి నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్న వ్యాగన్ ఆర్ కారు మైహోం సర్కిల్ వద్దకు రాగానే గచ్చిబౌలి నుంచి నార్సింగి వైపు వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో టిప్పర్ కారుపై ఒరిగి పోవడంతో కారులో ప్రయాణిస్తున్న సుదీప్, గౌతమ్, ఈశ్వర్ గాయపడ్డారు. లారీ డ్రైవర్ సతీష్ అందులోనే ఇరుక్కుపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తప్పించి లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. బాధితులను ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో మేకల మృతి

తలకొండపల్లి: కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బైండ్ల నరసింహ తన వ్యవసాయ పొలం వద్ద శనివారం సాయంత్రం మేకలను పాకలో ఉంచి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా.. పాకలో నాలుగు మేకలు మృతి చెంది ఉన్నాయి. రాత్రి కుక్కలు దాడి చేయడంతో మేకలు మృత్యువాత పడ్డాయని నరసింహ తెలిపారు. మృతి చెందిన మేకల విలువ రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు

14 బైక్‌లు స్వాధీనం

మోతీనగర్: జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేసి అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనుకున్న యువకులను అల్లాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన గాయత్రి నగర్ క్రాస్ రోడ్డు దగ్గర బైక్‌లను తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై అటుగా వెళుతున్న నలుగురు వ్యక్తులపై అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 14 బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితులను నానక్‌రామ్‌గూడ కు చెందిన చప్పిడి గణేష్, బాచుపల్లికి చెందిన గుబ్బల పవన్ కుమార్, మోతీనగర్‌కు చెందిన గుబ్బల శ్రీరాం మైనర్‌గా గుర్తించారు. వీరు చిన్ననాటి స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు 14 బైక్‌లను చోరీ చేసి, అద ను చూసి అమ్ముకునేందుకు ఓ ఇంట్లో దాచి పెట్టారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు లు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వా హనాల దొంగలను చాకచక్యంగా పట్టుకున్నందుకు ఉన్నతాధికారులు అల్లాపూర్ క్రైమ్ సిబ్బందిని అభినందించి, రివార్డు అందజేశారు.

జీవన ఎరువు.. సాగుకు ఆదరువు

- రైతులకు తగ్గనున్న పెట్టుబడి భారం
- పెరగనున్న పంట దిగుబడులు
- కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ



కందుకూరు: పంటల సాగులో ఎరువుల పాత్ర అత్యంత కీలకం. మొక్క ఎదిగి మంచి దిగుబడులు రావాలంటే అన్నదాతలు సకాలంలో ఎరువులను ప్రయోగించాలి. వీటిలో జీవన ఎరువుల వాడకం రైతులకు పెట్టుబడిభారాన్ని తగ్గిస్తోంది. ప్రకృతిలోని సూక్ష్మజీవులు పోషకాలను గ్రహించి మొక్కలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చే సముదాయాన్ని జీవన ఎరువులు(బయోఫర్టిలైజర్) అంటారు. వీటి ఉపయోగంతో రైతులకు కృత్రిమ ఎరువుల భారం తగ్గి, దిగుబడులు పెరుగుతాయని కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ పేర్కొంటున్నారు. ఆయన జీవన ఎరువుల వాడకం, వాటి ఉపయోగం గురించి రైతులకు పలు సూచనలిచ్చారు. జీవన ఎరువులు రెండు రకాలు. నత్రజని స్థిరీకరించేవి, భాస్వరాన్ని అందుబాటులోకి తెచ్చేవి.

నత్రజని జీవన ఎరువులు

వేరుశనగ, వరి, పప్పుధాన్యాల్లో వీటి వాడకంతో రసాయన ఎరువుల వాడకం 20–30 శాతం తగ్గించవచ్చు. ఉదాహరణకు రైజోబియం, అజటోబ్యాక్టర్, అజోస్పైరిల్లం, అసిటోబ్యాక్టర్, బ్లూగ్రీన్ ఆల్గే, అజోల్లా మొదలైనవి.

రైజోబియం

ఇది ఒక బ్యాక్టీరియా జాతికి సంబంధించినది. ఇది పప్పు జాతి మొక్కల వేరు వ్యవస్థ ద్వారా సహజీవనం చేస్తాయి. వేరుశనగ, కంది, పెసర, మినుము, అలసంద, చిక్కుడు, సోయా వంటి పంటల వేర్లకు ఉండే చిన్న చిన్న బుడిపెల్లో ఉంటాయి. ఇవి గాలిలో నత్రజని గ్రహించి మొక్క వేర్లకు అందిస్తాయి. నత్రజని పంట పెరుగుదలలో ఉపయోగపడే ముఖ్య పోషకం. వాతావరణంలో 70 శాతం పైగా వ్యాపించి ఉన్నప్పటికీ భూమిలో అత్యంత తక్కువగా ఉండటంతో మొక్కకు నత్రజని లోపం ఏర్పడుతుంది. రైజోబియం వంటి సూక్ష్మజీవులకు వాతావరణంలోని నత్రజనిని గ్రహించి/స్థిరీకరించి మొక్కకు అందించే సామర్థ్యం ఉంది.



పశువుల ఎరువులో నిల్వ ఉంచిన జీవన ఎరువు

అజటోబాక్టర్

ముఖ్యంగా వరి, చెరుకు, జొన్న, సజ్జ, పత్తి, మిరప, పొద్దుతిరుగుడు, కూరగాయల పంటలకు బాగా పనిచేస్తాయి. పెరుగుదలకు కారకాలైన హార్మోన్లను, విటమిన్లను ఉత్పత్తి చేస్తాయి.

అజోస్పైరిల్లం

సహవాసి సూక్ష్మజీవులు, గాలిలోని నత్రజని తీసుకుని వేర్ల మీద స్థిరీకరించగలవు. పప్పుజాతి పైర్లు కాక మిగిలిన అన్ని పైర్లకు ఉపయోగపడతాయి. వరి, చెరుకు, పత్తి, అరటి మొదలైనవి.

అసిటోబ్యాక్టర్

ఇవి చెరుకు వేర్లు, కాండం, ఆకుల మీద నివసిస్తూ విధిగా సహాయపడే సూక్ష్మజీవులు. ఇవి అజోస్పైరిల్లం ఉత్పత్తి చేసే దానికి రెండింతలు ఇండోల్ ఎసిటిక్ ఆసిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేయగలవు. చక్కెర శాతం 0.5–1 శాతానికి పెరుగుతుంది.

అజోల్లా

ఇది సాధారణంగా బావులు, చెరువులు, కొలనులు, వరి పొలాల్లో నీటిపై తేలియాడుతూ కనిపించే ఫెర్న్ జాతి మొక్క. ఇది నత్రజని స్థిరీకరించే నీలి ఆకుపచ్చ నాచు(అనాబినా)తో సహజీవనం సాగిస్తూ నత్రజనిని ఉపయోగించుకుంటూ బాగా పెరిగి నేలలో కలుస్తుంది. 40–60 కిలోల నత్రజనిని వరి పైరుకు అందిస్తుంది.

నీలి ఆకుపచ్చ నాచు

ఇది వరి పైరుకు ఉపయోగించాల్సిన జీవన ఎరువు. దీని వాడకంతో ఎకరాకు 8–12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది. వరి నాటిన వారం పది రోజుల్లో ఎకరాకు 4 కిలోల నాచుపొడిని నీటిపై చల్లాలి. పొలంలో కనీసం వారం వరకు తగిన నీరు ఉండేటట్లు చూడాలి. మొక్క వేర్లకు ఆక్సిజన్ కావాల్సినంతగా లభ్యమవుతుంది. దీన్ని 3–4 పంట కాలాలను వరుసగా వేస్తే తర్వాత వేయనవసరం లేదు.

భాస్వర జీవన ఎరువులు(పీఎస్‌బీ)

భాస్వరం అందించడానికి ఫాస్ఫోబ్యాక్టీరియా, మైకోరైజా ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

➡ ఫాస్ఫోబ్యాక్టీరియా

వీటిని ఫాస్ఫరస్ సాల్యుబిలైజింగ్ మైక్రో ఆర్గానిజమ్స్ అంటారు. వీటిలో సుడోమోనాస్, బాసిల్లస్ సూక్ష్మజీవులు, పెన్సీలియం, అస్పర్జిల్లస్ శిలీంద్రాలు ముఖ్యమైనవి. వీటి చర్యలతో నీటిలో కరగని రూపంలో ఉన్న భాస్వరాన్ని కరిగేలా చేసి మొక్కకు అందిస్తాయి. అందుకు అవసరమయ్యే సేంద్రియ ఆమ్లాలు ఈ సూక్ష్మజీవుల నుంచి వృద్ధి చెందుతాయి.

➡ ఫాస్పేటు మొబిలైజింగ్ మైకోరైజా(వీఏఎం)

ఇది శిలీంద్రం(బూజు) జాతికి చెందినది. కంటికి కనిపించదు. ఈ బూజు వేరు కంటే బాగా విస్తరించి పోషకాలను, తేమను, పీల్చుకుని మొక్క వేర్లకు అందిస్తుంది.

ప్రస్తుతం ఈ ఎరువులు ఘన, ద్రవ రూపాల్లో అందుబాటులో ఉన్నాయి. రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేంద్రీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ హయత్‌నగర్‌లో లభిస్తాయి. వీటిని పశువుల ఎరువులో కలిపి 15 రోజుల పాటు నిల్వ ఉంచి అనంతరం పంటలో వేయాలి.

పాన్ షాపునకు నిప్పంటించిన దుండగులు

రూ.రెండు లక్షలకు పైగా నష్టం

అబ్దుల్లాపూర్‌మెట్: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ పాన్‌షాపునకు దుండగులు అర్ధరాత్రివేళ నిప్పుపెట్టారు. దీంతో మంటలకు పాన్‌షాప్‌లోని సరుకులు దగ్ధమైన సంఘటన పెద్దఅంబర్‌పేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలోని తాజా టిఫిన్ హోటల్ వద్ద ఆరునెలల క్రితం మహ్మద్ నిజాం పాన్‌షాప్‌ను లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రోజు మాదిరిగానే రాత్రి 12 గంటలకు పాన్‌షాప్‌ను కట్టేసి ఆయన ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున వచ్చి చూసే సరికి పాన్‌షాప్ పూర్తిగా దగ్ధమై ఉంది. వెంటనే హయత్‌నగర్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పలు కెమెరాల్లో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి నిప్పంటించినట్లు కనిపిస్తున్నప్పటికీ వారి ముఖాలు, వాహనాల నంబర్లపై స్పష్టత లేదన్నారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా తాజా టిఫిన్స్ హోటల్‌లో ఉండే సీసీ కెమెరాలు అర్ధరాత్రి 1 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఆఫ్ చేసి ఉన్నాయని, తెలిసిన వారే పాన్‌షాప్ దహనం చేసి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. దాదాపు రూ.రెండు లక్షలకు పైగా నష్టపోయానని బాధితుడు ఆవేదన చెందుతున్నారు. దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.



మంటల్లో కాలిబూడిదైన పాన్‌షాప్

ఫిలింనగర్‌లో చోరీ..

ఫిలింనగర్: బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి విలువైన బంగారు ఆభరణాలను తస్కరించిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–80లో నివసించే శారదారెడ్డి ఈ నెల 9న రాత్రి వజ్రాలతో పొదిగిన మంగళసూత్రంతో పాటు ఇతర ఆభరణాలను టేబుల్‌పై ఉంచింది. ఆదివారం ఉదయం ఆభరణాలు వేసుకునేందుకు చూడగా అవి కనిపించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా శనివారం తెల్లవారుజామున బైక్‌పై ఇద్దరు యువకులు అక్కడికి వచ్చినట్లు గుర్తించారు. వారిలో ఒకరు బైక్‌పై కూర్చోగా, మరో వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూంలో ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్తున్నట్లుగా రికార్డయ్యింది. ఫిర్యాదుతో పాటు అమె సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



నహీద్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

కొందుర్గు: కల్వకుర్తి పట్టణంలో ఆదివారం నిర్వహించిన రెండో జాతీయ స్థాయి ఆల్ స్టైల్ కరాటే పోటీల్లో కొందుర్గు న్యూమాంక్స్ అసోసియేషన్ విద్యార్థి మెరిశారు. కుంగ్‌ఫూలో స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి నహీద్ ప్రతిభ చూపినట్లు మాస్టర్ రమేశ్ తెలిపారు. అండర్–12 స్పైరింగ్ విభాగంలో ప్రతిభ కనబర్చి ముందు వరుసలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలికకు నిర్వాహకులు మల్లికార్జున్‌గౌడ్ మెడల్స్‌తోపాటు ప్రశంసాపత్రం అందించారన్నారు.

విద్యారంగంలో ఉత్తమ సేవలు

సాక్షి, సిటీబ్యూరో: రాణీరుద్రమాదేవి లెజెండరీ అవార్డును క్యాపిటల్ విద్యాసంస్థల డైరెక్టర్ హేమలత అందుకున్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 78వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పదేళ్లలో విద్యారంగంలో అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రకటించినట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డా.ఎస్.సరోజనమ్మ తెలిపారు. తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యా విధానాల అమలు, ఉద్యోగుల సేవలను పరిగణలోకి తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పాల్గొన్నారు.

బీజేవైఎం నేతకు స్వాగతం



రోహిత్ చాహల్‌ని శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్‌ని స్థానిక పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనను కలిసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్, సురేందర్ శర్మ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు వైభవ్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, కృష్ణ, దామోదర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వారు పూలబొకేను అందించి శాలువాతో సన్మానించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

పర్యావరణ అవార్డు గ్రహీత రామకృష్ణారావు



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందిస్తున్న వైద్యసిబ్బంది, రామకృష్ణారావు

చేవెళ్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ గుర్తించాలని పర్యావరణ అవార్డు గ్రహీత, సామాజిక వేత్త పి.రామకృష్ణారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఆదివారం గాంధీ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 100 మంది స్థానిక యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రామకృష్ణారావు మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంతంలోని యువత ఎంతో సేవా దృక్పథం కలిగిన వారన్నారు. ఎప్పుడు ఏ కార్యక్రమం తీసుకున్న స్వచ్ఛందంగా ముందుకు వస్తారన్నారు. రక్తదానం చేయటంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి రక్తనిధి మెడికల్ ఆఫీసర్ సత్యప్రభ, మెడికల్ కౌన్సిలర్ సునీత, సిబ్బంది, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు దూరంగా ఉపాధి కల్పన కార్యాలయం

- దూరభారంతో నిరుద్యోగుల అవస్థలు
- పట్టించుకోని రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు

నాంపల్లి: రంగారెడ్డి జిల్లాలో ఉండాల్సిన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం హైదరాబాద్ జిల్లాలో కొనసాగుతోంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన యువత, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కోసం రాకపోకలు సాగించడానికి బాగా దూరాభారం అవుతోంది. చాలా మంది రైళ్లు, బస్సులు, ఆటోలను పట్టుకుని ఇక్కడికి వస్తుంటారు. పని మీద ఉదయాన్నే ఇంటి దగ్గర బయలుదేరితే ట్రాఫిక్, ఇతరత్రా కారణాలతో నాంపల్లిలోని శాంతినగర్‌కు చేరుకోవాలంటే సాయంత్రం అవుతోంది. కార్యాలయం ఏదైనా ప్రజలకు అందుబాటులో ఉండాలి. నిత్యం రంగారెడ్డి జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు మాత్రం తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

పరిపాలన సౌలభ్యం కోసం..

పరిపాలన సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో ఒక కొత్త జిల్లా కలెక్టరేట్‌ను నిర్మించారు. కొత్త రాష్ట్రం ఏర్పాటులో భాగాంగానే రంగారెడ్డి జిల్లాకు కొంగర్ కలాన్‌లో అత్యాధునిక జిల్లా కలెక్టరేట్ పనిచేస్తోంది. ఒకప్పుడు కలెక్టరేట్‌లోనే అన్ని శాఖలు ఇమడలేక అక్కడక్కడా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకుని కొనసాగించేవారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. కలెక్టరేట్‌లోనే కావాల్సినన్ని గదులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌కు అందుబాటులో ఉండాల్సిన అనుబంధ శాఖలన్నీ ఒకే ప్రాంగణంలో కొనసాగే అవకాశం ఉంది. అయితే కలెక్టరేట్‌లో ఉండాల్సిన కొన్ని శాఖలు నేటికీ కలెక్టరేట్‌కు దూరంగానే ఉంటున్నాయి. నూతన కలెక్టరేట్ ప్రాంగణాలను ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా జిల్లా కలెక్టరేట్‌కు దూరంగానే ఉంటున్నాయి. ఈ సంస్థలను కలెక్టరేట్ ప్రాంగణాల్లోకి తీసుకెళ్లాలనే సోయి రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు లేకుండా పోయింది. త్వరగా జిల్లా కలెక్టరేట్‌కు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని తరలిస్తే అందరికీ సౌలభ్యంగా ఉంటుంది.



శాంతినగర్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన రంగారెడ్డి జిల్లా ఉపాధి శిక్షణా కార్యాలయం

ఐటీఐ సెంటర్లన్నీ ఒకే చోటుకు..

ఒకప్పుడు శాంతినగర్ క్యాంపస్‌లో ఒకే ఐటీఐ ఉండేది. ఇప్పుడు హైదరాబాదులోని పలు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగే ఐటీఐ సెంటర్లను శాంతినగర్ క్యాంపస్‌లోకి మార్చారు. ప్రస్తుతం ఉన్న శాంతినగర్ క్యాంపస్‌లోనికి అదనంగా సనత్‌నగర్, ఖైరతాబాద్ సెంటర్లు కూడా వచ్చి చేరాయి. వీటితో క్యాంపస్ ప్రాంగణమంతా ఇరుకిరుకుగా మారిపోయింది. వీటికి తోడు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ఉపాధి శిక్షణా సంస్థలు, రీజినల్ ఎంప్లాయిమెంట్ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. వీటిని ఆయా కలెక్టరేట్లకు తరలించకపోవడంతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీ సెంటర్లుగా మార్చే యోచన చేస్తోంది. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఐటీఐలను ఏటీసీ సెంటర్లుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఇందులో భాగంగానే శాంతినగర్ క్యాంపస్‌కు పక్కనే ఉన్న మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌లో ఏటీసీ సెంటర్ల ఏర్పాటుకు భూమి పూజ కూడా చేశారు. ఇలాంటి తరుణంలో మల్లేపల్లి ఐటీఐతో దీటుగా శాంతినగర్ క్యాంపస్ కూడా ఏటీసీ సెంటర్‌గా మారిస్తే బాగుంటుందనే అభిప్రాయం శాంతినగర్ క్యాంపస్ విద్యార్థుల్లో వ్యక్తం అవుతోంది. ఈ క్యాంపస్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ఉపాధి శిక్షణా సంస్థలు కలెక్టరేట్ ప్రాంగణాలకు తరలివెళ్లకపోవడంతోనే శాంతినగర్ క్యాంపస్‌కు ఏటీసీ సెంటర్‌గా మారే యోగం లేకుండా పోయిందని నిట్టూర్పుతున్నారు. ఈ కార్యాలయాలు త్వరలోనే కలెక్టరేట్లకు మారితే శాంతినగర్ క్యాంపస్‌లో కూడా ఏటీసీ సెంటర్‌గా ఏర్పాటయ్యే అవకాశం ఉందని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని శాంతినగర్ క్యాంపస్‌ను కూడా రెండవ దఫాలో ఏటీసీ సెంటర్ కోసం భూమి పూజ చేయాలని కోరుతున్నారు.